

7న పేరెంట్స్, టీచర్స్ సమావేశం

అరసవల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 7న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో డిసెంబరు నాటికి తాగునీరు, మరుగుదొడ్లు లేని కేంద్రాలు ఒక్కటి కూడా ఉండరాదని స్పష్టం చేశారు.

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

- కొత్తమారడి కోటలో పెరుగుతున్న బాధితులు
- గత ఐదేళ్లలో 15 మంది మృతి
- ఫ్లోరైడ్ నీటితో ఇక్కట్లు
- సమస్య పరిష్కరించాలని గ్రామస్థుల వేడుకోలు



● మెళియాపుట్టి మండలం కొత్తమారడి కోట గ్రామానికి చెందిన వాడవలస హరికృష్ణ గతేడాది కిడ్నీ వ్యాధి బారిన పడ్డాడు. చికిత్స పొందుతూ.. గత నెల 24న మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన నందిగాం కృష్ణమూర్తి కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ సెప్టెంబరులో ప్రాణాలు కోల్పోయారు. అలాగే మూడు నెలల కిందట తమిరి పుచ్చన్న కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు.

మెళియాపుట్టి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

..ఇలా కొత్తమారడికోట గ్రామాన్ని కిడ్నీ వ్యాధి కబళిస్తోంది. ఈ గ్రామంలో 120 కుటుంబాలు ఉండగా.. 300 మంది నివసిస్తున్నారు. గత ఐదేళ్లలో కిడ్నీవ్యాధితో సుమారు 15మంది మృతి చెందారు. ప్రస్తుతం 20 మందికిపైగా బాధితులు చికిత్స పొందుతున్నారు. కొంతమంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఏటా బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సేవలు అందక.. కొంతమంది బాధితులు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఓ వైపు మానసికంగా.. మరోవైపు వైద్యం కోసం అప్పు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో ఈ గ్రామాన్ని వైద్య సిబ్బందితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించి తాగునీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండడంతో కిడ్నీ వ్యాధి ప్రబలుతోందని గుర్తించారు. గ్రామానికి రక్షిత నీటి


కొత్తమారడికోటలో రక్షిత నీటి పథకం

(మిగతా 6వ పేజీలో..)

కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లాం..



మా గ్రామంలో కిడ్నీవ్యాధి ప్రబలడానికి తాగునీరే కారణమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లాం.

-మజ్జి తిరుపతిరావు, మారడికోట, మెళియాపుట్టి

నీరు కొందామన్నా.. దొరకదు



శుద్ధ జలాన్ని కొనుకుని తాగుదామన్నా.. మారుమూల గ్రామం కావడంతో ఇక్కడకు ఎవరూ తేవడం లేదు. గత్యంతరం లేక మోటారు నీటిని తాగుతున్నాం.

-టి.యుగంధర్, మారడికోట, మెళియాపుట్టి

భయపడుతూ బతుకుతున్నాం..



ప్రతి రోజు భయపడుతు బతుకుతున్నాం. ఏ రోజు ఎవరు మృతి చెందుతున్నారో తెలియడం లేదు. అధికారులు స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి. సమస్య పరిష్కరించాలి.

-ఐ.మహలక్ష్మి, కొత్తమారడికోట, మెళియాపుట్టి

సౌదీలో చిక్కుకున్న వారిని స్వదేశానికి తీసుకురావాలి

- కేంద్ర విదేశాంగ శాఖ మంత్రికి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వినతి



శ్రీకాకుళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి.. మోసపూరిత యాజమాన్యాల చేతిలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కార్మికులను తిరిగి స్వదేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో మంగళవారం కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి సౌదీ అరేబియా వెళ్లిన 22 మంది కార్మికులు.. అక్కడి యాజమాన్యం మోసపూరిత వైఖరితో రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆహారం సైతం లేక అల్లాడుతున్నారని.. జిల్లాలో బాధిత కుటుంబాలు సైతం ఎంతో ఆందోళనగా ఉన్నాయని వివరించారు. తక్షణమే చొరవచూపి కార్మికులను క్షేమంగా స్వదేశానికి తిరిగి తీసుకువచ్చేలా కృషి చేయాలని కోరారు. బాధితులకు సత్వర సాయం లభించేలా సౌదీలోని భారత ఎంబసీకి సమాచారం అందించాలని విన్నవించారు. దీనిపై కేంద్రమంత్రి జైశంకర్ సానుకూలంగా స్పందించారు.

క్షేమంగా తెచ్చేందుకు కృషి


- మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్



శ్రీకాకుళం/ కోటబొమ్మాళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'సౌదీ అరేబియాలో చిక్కుకున్న జిల్లా యువకులను సొంత ప్రాంతాలకు క్షేమంగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఏపీ ఎన్‌ఆర్‌టీ విభాగం ద్వారా సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయంతో ఇప్పటికే సంప్రదించామ'ని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎన్‌ఆర్‌ఐ సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 'విదేశాంగ శాఖ ఉన్నతాధికారులతో ఈ విషయమై సంప్రదించాలని కలెక్టర్‌ను ఆదేశించాం. బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దు. వారిని త్వరగా ఇంటికి తీసుకువస్తాం. మా కార్యాలయం ద్వారా సౌదీ అరేబియాలోని తెలుగు సంఘాలతో సంప్రదించి వారు క్షేమంగా ఉండేలా, వారికి భారత ఎంబసీ భోజనాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. మా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. అక్కడే ఉన్న తెలుగు సంఘాల సహకారం తీసుకుంటాం. వీలైనంత త్వరగా వారిని స్వస్థలాలకు తీసుకువస్తాం. ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాల మెరుగు పరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తాం. ఎన్డీయే ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధికి, యువతలో నైపుణ్య శిక్షణ పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామ'ని మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

రెవెన్యూ సమస్యలకు చెక్

- ఈ నెల 6 నుంచి గ్రామాల్లో సదస్సులు
- సన్నాహాలు చేస్తున్న అధికారులు



ఇచ్ఛాపురంలోని వార్డు సచివాలయం

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):

రెవెన్యూ సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో భారీగా భూ అవకతవకలు జరిగాయి. జగనన్న ఇళ్ల కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున భూ దందా జరిగిందనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు 20 ఏళ్లు దాటిన డీ పట్టా భూములను అమ్ముకోవచ్చన్న జీవోతో వందలాది ఎకరాలు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం జూన్ నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు స్వీకరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 71,335 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 66 శాతం ఫిర్యాదులకు పరిష్కార మార్గం చూపించింది. అయితే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి వినతులు స్వీకరించి, సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. ఈ మేరకు రెవెన్యూ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

గ్రామాల వారీగా సదస్సులు..

జిల్లాలో 912 పంచాయతీలు, 835 సచివాలయాలు ఉన్నాయి. పంచాయతీల వారీగా గ్రామ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శిస్తారు. భూ ఆక్రమణలు, 22ఏలో ఉన్న భూముల తారుమారు వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిపెడతారు. వాటిని సరిచేసి బాధితులకు న్యాయం చేస్తారు. సదస్సులపై తొలుత రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల ప్రతినిధులతో కలెక్టర ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సన్నాహక సమావేశంలో ప్రభుత్వ ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేస్తారు. గ్రామాల్లో ముఖ్య ప్రదేశాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. సదస్సుకు రెండు రోజుల ముందు గ్రామానికి సంబంధించి అడంగల్, పహాణీ, ప్రభుత్వ భూ రిజిస్టర్ కాపీలు ముద్రించి వీఆర్వో ప్రదర్శిస్తారు. స్వీకరించిన అర్జీలకు రశీదులు, తక్షణం తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక అందించాల్సి ఉంటుంది. జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని పర్యవేక్షణాధికారిగా ప్రభుత్వం నియమించనుంది.

● అన్ని శాఖలతో బృందం..

వాస్తవానికి ఆగస్టులోనే గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కానీ అప్పట్లో ఉద్యోగుల బదిలీలు, రెవెన్యూ సిబ్బంది స్థానచలనం కారణంగా వాయిదా వేసింది. తాజాగా నిర్వహించనున్న సదస్సులకు సంబంధించి బృందంలో తహసీల్దారు, ఆర్ఐ, సంబంధిత గ్రామాల వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయ శాఖ అధికారి, అవసరమైన చోట వక్ఫ్‌బోర్డు అధికారి, రిజిస్ట్రేషన్, అటవీ భూములకు సంబంధించి అధికారి ఉంటారు. ఆయా గ్రామాల్లో రీసర్వే పూర్తయితే నూతనంగా తయారుచేసిన ఆర్వోఆర్‌ను చదివి అభ్యంతరాలు స్వీకరిస్తారు. పార్టీ లోగోలు, రంగులతో కూడిన బీహెచ్‌పీలను తిరిగి సేకరిస్తారు. మళ్లీ తాజాగా రైతులకు అందిస్తారు. కలెక్టర్, జేసీ సైతం సదస్సుల్లో పాల్గొంటారు. ఆర్డీవోలు విధిగా ప్రతి మండలంలో రెండు గ్రామాలను సందర్శిస్తారు. సదస్సుల్లో వచ్చిన వినతులను అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. కొన్ని తక్షణమే పరిష్కరిస్తారు. మిగిలినవి ఉన్నతాధికారులకు చేరవేస్తారు. సదస్సులు పూర్తయిన 45 రోజుల్లో సమస్యకు తప్పకుండా పరిష్కార మార్గం చూపించడమే ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మట్టి పూసి.. మాయ చేసి!

- కొండలపై రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం
- పర్యవేక్షణ కరువు
- కాంట్రాక్టరే ఇంజనీర్
- అడుగడుగునా నాణ్యతా లోపం

6లో


అడ్డివాడలో ఇంజనీరింగ్ సిబ్బంది లేకుండా రోడ్డు పనులు (ఫైల్)

పెద్దపులి దాడిలో దూడ మృత్యువాత

- మూడు రోజుల తరువాత వెలుగులోకి..
- ఒడిశా వైపు వెళ్లినట్టు అనుమానాలు

6లో

అడవి జంతువులతో భయం భయం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోడ్డు పనులు వేగవంతం చేయండి

- భవన నిర్మాణాలు పూర్తి చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'అనుమతులు ఉన్న రోడ్డు పనులు వేగవంతం చేయాలి. ముగింపు దశలో ఉన్న భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న రోడ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణ వివరించారు. రూరల్ రోడ్డు ప్రాజెక్టు 315 పనులకు 35 పూర్తి కాగా, 280 పనులు జరుగుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పనుల పురోగతిపై జిల్లా అధికారులు సమీక్షించి వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్దానంలో తాగునీటి పథకం పనులు పూర్తి చేయాలని సూచించారు.

శతశాతం పల్లెపండుగ పనులు..

పల్లె పండుగలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, డ్వామా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పలు మండలాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులలో పురోగతి పెంచాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే కేటాయింపులు రద్దు చేసి అవసరమైన చోట ఆ నిధుల్ని సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రగతిలో వెనకంజలో ఉన్న పొందూరు, ఎల్.ఎన్.పేట మండల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 7 నాటికి రూ.40 కోట్లు బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రస్తుతం రూ.22కోట్లకు మాత్రమే బిల్లులు వచ్చాయన్నారు. మంగళవారం నాటికి రూ.50కోట్లు బిల్లులు చెల్లించేలా పనులు పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్‌బాబు, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, పీఆర్‌ఎస్ఈ నాయుడు పాల్గొన్నారు.

ఆభరణాలతోపాటు వడ్డీ చెల్లించాలి

- గార ఎస్‌బీఐ ఎదుట ఖాతాదారుల ఆందోళన

గార, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'బ్యాంక్‌లో తనఖా పెట్టిన మా బంగారు ఆభరణాలను వెంటనే ఇప్పించాలి. ఏడాదికిపైగా తాత్సారం చేస్తున్న నేపథ్యంలో ఆ ఆభరణాలకు వడ్డీ కూడా చెల్లించాల'ని మంగళవారం పలువురు ఖాతాదారులు గార ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సుమారు ఏడాది కిందట గార ఎస్‌బీఐలో తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు మాయమైన ఘటన తెలిసిందే. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండడంలో ఆభరణాలు ఖాతాదారులకు ఇవ్వడంలో సిబ్బంది తాత్సారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఖాతాదారులు నిరసన చేపట్టారు. అయినా స్పందన లేకపోవడంతో మంగళవారం మళ్లీ ఎస్‌బీఐ కార్యాలయానికి చేరుకుని ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా బ్యాంకు వద్దకు చేరుకున్న ఆర్‌ఎం అబ్దుల్ హమీద్ హసీద్, న్యాయవాది కె.తిరుమలరావుతో స్థానిక సర్పంచ్ మార్పు దుర్గా పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జల్లు రాజీవ్‌తో పాటు పలువురు ఖాతాదారులు మాట్లాడారు. ఏడాది దాటినా ఇంతవరకు తమ బంగారు ఆభరణాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వ్యవసాయ, గృహ అవసరాల కోసం తమ బంగారు ఆభరణాలు బ్యాంకులో ఎంతో నమ్మకంతో తాకట్టు పెడితే, వాటిని ఇవ్వకుండా ఇలా తిప్పడం ఏమిటని ప్రశ్నించారు. తమ సిబిల్ స్కోర్ పడిపోవడంతో ఇతర రుణాలు కూడా మంజూరు కావడం లేదని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా తమ బంగారు ఆభరణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్‌ఎం తెలిపారు. ఈ నెల 13న కోర్టు వాయిదా ఉందని, దాని తర్వాత తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ జనార్దనరావు బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళన విరమించేలా ఖాతాదారులకు సర్దిచెప్పారు.


ఆర్‌ఎం అబ్దుల్, న్యాయవాది తిరుమలరావుతో మాట్లాడుతున్న ఖాతాదారులు

- కొండలపై రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం
- పర్యవేక్షణ కరువు
- కాంట్రాక్టరే ఇంజనీర్
- అడుగడుగునా నాణ్యతా లోపం



అడ్డివాడ రోడ్డుపై కాంక్రీట్ వేసిన వెంటనే మట్టి వేసి కప్పేసిన దృశ్యం



రోడ్డు.. ఇదే ఎత్తు..

మట్టి పూసి.. మాయ చేసి!

మెళియాపుట్టి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ఆడిందే ఆట... పాడిందే పాటగా నడిచిన విషయం తెలిసిందే. వైసీపీ నాయకులు పనులు చేయకపోయినా బిల్లులు చేయించుకోవడమూ తెలుసు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారులను గాడిలో పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రయత్నిస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది. కొంతమంది అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్లకు కమీషన్ల ఎరజూపి... వారే పనులు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మెళియాపుట్టి మండలానికి సంబంధించి కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి నిధులు కేటాయించడం తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజవర్గానికి చెందిన నేతల బంధువులు పనులు చేపట్టారు. అప్పట్లో పనులు చేపట్టకుండానే బిల్లులు చేశారనే విమర్శలు ఉన్నాయి. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ఐటీడీఏలో పని చేస్తున్న ఒక అధికారి గుంటూరు నుంచి కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చినట్టు తెలిసింది. నియోజకవర్గానికి చెందిన ఒక అధికార పార్టీ నాయకుడికి ఆ కాంట్రాక్టర్‌ను పరిచయం చేసి... ముందుగానే కమీషన్లు మాట్లాడుకున్నట్టు సమాచారం. ఇటీవల ముఖలింగపురం రోడ్డు నుంచి అడ్డివాడ వరకు పనులు చేశారు. మొదట రూ.84 లక్షలతో 1.70 కిలోమీటర్ల మేరకు మట్టి పనులు చేశారు. నిధులు సరిపోకపోవటంతో మళ్లీ రూ.1.75 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 1.93 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్డు పనులు చేశారు.

కాంట్రాక్టరే ఇంజనీర్..

ఈ పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కానీ.. వర్క్ ఇన్‌స్పెక్టర్ కానీ ఉండాలి. నాణ్యతను పరిశీలిస్తుండాలి. కానీ ఇక్కడ ఇంజనీరింగ్ అధికారులు లేకుండా పనులు చేస్తున్నారు. మొత్తం 2100 మీటర్ల పొడవున పనులు చేయవలసి ఉంది. ఎన్నికలకు ముందు 1400 మీటర్ల పనులు చేయగా... కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరో 700 మీటర్లు పూర్తి చేసింది. ఈ పనులు పూర్తి కాకముందే బిల్లులు చెల్లించినట్టు తెలుస్తోంది. బిల్లులు చెల్లించిన కొన్నాళ్ల తరువాత పనులు పూర్తి చేశారు. 175 మీ.మీ. ఎత్తు, 3.75 మి.మీ. వెడల్పున రోడ్డు వేయాలి. అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. ఒక మిల్లీ మీటరు పనికి 30 ఎంఎం మెటల్‌తో పాటు 70 కిలోల సిమెంటు వాడవలసి ఉండగా.. అదీ కనిపించడం లేదు. రహదారి పనులు జరిగిన తరువాత నీటితో రోజూ తడుపుతూ ఉండాలి. కానీ కాంక్రీట్ వేసిన వెంటనే రోడ్డుపై మట్టి, రాళ్లు వేసి రహదారి కనిపించకుండా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కనిపించని ఏఈ..

ఐటీడీఏ ఏఈ దగ్గర ఉండి పనులు చేయించవలసి ఉంది. కానీ ఆయన ఎప్పుడూ పనుల వద్దకు రారనే ఆరోపణలు ఉన్నాయి. విశాఖపట్నం నుంచి విధులకు హాజరవుతున్నారని తెలిసింది. గత వైసీపీ హయాంలో నాయకుల మద్దతు ఉండడంతో విధులకు సక్రమంగా హాజరు కాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం అదే తీరు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొంతమంది అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల గిరిజన దర్బార్‌లో ఏఈపై పీవోకు పెద్దలక్ష్మీపురం మాజీ సర్పంచ్ బి.లలిత కుమారి ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్ సైతం ఆయన బంధువే కావడం గమనార్హం.

తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటాం

ఇటీవలే రోడ్డును పరిశీలించాను. అంతా సక్రమంగానే ఉంది. నాణ్యతను నిర్ధారించాకే బిల్లులు చెల్లిస్తాం. తేడాలుంటే చర్యలు తీసుకుంటాం.

-రమాదేవి, ఈఈ

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

(ఐదో పేజీ తరువాయి)

పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కాగా గత ఐదేళ్ల నుంచి ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించడంతో ఇక్కడ నీరు తాగేందుకు ప్రజలు భయప డుతున్నారు. గతంలో పాతమారడికోటలో శుద్ధజల ప్లాంట్ ఏర్పాటు చేశారు. కొంతమంది అక్కడకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మరి కొంతమంది తప్పనిసరి పరిస్థితుల్లో పాత మోటారుపైపు నుంచి వస్తున్న నీటిని తాగాల్సి వస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. తాగునీరు కొనుగోలు చేద్దా మనుకున్నా.. మారుమూల గ్రామం కావడంతో ప్రైవేటు యాజమాన్యాలు అందివ్వని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కొత్తమారడికోటలో శుద్ధజల పథకం ఏర్పాటు చేయాలని వైసీపీ హయాంలో అప్పటి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతికి విజ్ఞప్తి చేశామని.. కానీ ప్రయోజనం లేదన్నారు. ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కిడ్నీ వ్యాధి నివారణకు, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కేంద్రమంత్రికి సమస్య వివరిస్తున్న గ్రామస్థులు (ఫైల్)

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

జలుమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ఆదేశించారు. చల్లవానిపేట కూడలి, యలమంచిలిలోని రైస్ మిల్లులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్ జనరేట్ అయిన వెంటనే రైతు ఇచ్చిన ధాన్యాన్ని మిల్లులకు పంపాలన్నారు. 48 గంటల్లోగా రైతు ఖాతాకు నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఎండల కామేశ్వరస్వామి మోడరన్ రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం పెండింగ్ ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. మండలంలో ఇప్పటివరకు 1,508 మంది రైతులు 9,778 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించారన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ జన్ని రామారావు, ఆర్ఐ కిరణ్, వీఆర్వో అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రత్యూష

పోర్టు రైల్వే భూముల నిర్వాసితులకు త్వరలో చెల్లింపులు

టెక్కలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోర్టు రైల్వేలైన్‌కు భూములిచ్చిన నిర్వాసితులకు త్వరలో చెల్లింపులు చేపడతామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పోతునాయుడుపేట, యామాలపేట, రాజపురం, కాశీపురం, కోటపాడు, కూర్మన్నపేట గ్రామాలకు చెందిన రైతులతో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోర్టు రైల్వే ట్రాక్‌కు 72 ఎకరాల భూములిచ్చే 142 మంది రైతులకు రూ.19 కోట్ల వరకు చెల్లించే అవకాశాలున్నాయన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎల్ఎల్ నాయుడు తదితరులు అదనంగా చెల్లించాలని ఆర్డీవోను కోరగా, ఆ పరిస్థితి లేదన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

బహుముఖ ప్రజ్ఞాశాలి ఈ మాస్టారు!


- కళా, సేవా రంగాల్లో రాణిస్తున్న తాతయ్య
- రచయితగానూ గుర్తింపు



బిచ్చగాడిగా..



ఏపీ చీఫ్ సెక్రటరీ ఎదుట తాతయ్య ఏకపాత్రాభినయం (ఫైల్)



తాతయ్య రచించిన తెలుగుభాష విజ్ఞాన దర్శిని పుస్తకం

టెక్కలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. కానీ రచయితగా... నటుడిగా... వ్యాఖ్యాతగా... అష్టావధానిగా ఇలా విభిన్న రంగాల్లో ప్రతిభ చూపిస్తూ... ప్రశంసలు అందుకుంటున్నారు. పలాస మండలం వీర భద్రాపురంలో జన్మించి... టెక్కలి రోటరీ నగర్‌లో స్థిరపడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేసిన ఆయనే మూల తాతయ్య. తన కళా ప్రదర్శనలతో గిరిజనంలో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నారు తాతయ్య. టెక్కలికి చెందిన ప్రజాచైతన్య కళాసమితి ద్వారా సామాజిక కార్యక్రమాల్లో నిరంతరం పాలు పంచుకుంటారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, మొక్కలు నాటడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ఓటర్లకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు, నేత్ర దానంపై అవగాహన కల్పించడంలో ముందుంటారు. అష్టావధానం.. పిల్లలకు పద్యాలు నేర్పించడం... భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలపై పిల్లలకు చైతన్యం కల్పించడం వంటివి చేస్తుంటారు.

ఇవీ రచనలు..

విద్యార్థి లోకానికి అవసరమయ్యే తెలుగుభాష విజ్ఞాన దర్శిని, దీపిక అభ్యాసం వంటి పుస్తకాలను తాతయ్య రచించారు. ఒకటి నుంచి ఐదు వరకు తెలుగు వాచకం రూపకల్పనలో భాగస్వామిగా ఉన్నారు. నాటక, కళారంగానికి అవసరమయ్యే అంతం.. అంతం.., నానూ చదువుకుంటా, మూల నవరత్నాలు, సుద్దులో సుద్దులు, ఆలిచిప్పలు వంటి రచనలు ఆయన కలం నుంచి వెలువడ్డాయి.

ప్రదర్శనలు ఇలా...

హైదరాబాద్‌లో 'ఆలిచిప్పలు' నాటిక ప్రదర్శన ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. దూరదర్శన్‌లో పలుమార్లు అంతం.. అంతం నాటిక ప్రదర్శితమైంది. ఐటీడీఏ ద్వారా 238 గ్రామాల్లో మూఢ నమ్మకాలపై మార్పు అనే రూపకాన్ని ప్రదర్శించారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, అండమాన్, భిలాయ్, చెన్నై, కోల్‌కత్తా, బరంపురంతో పాటు గుంటూరు, తిరుపతి, విశాఖ ప్రాంతాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేమ యుద్ధం, జయమ్మ పంచాయతీ, వీరగున్నమ్మ తదితర సినిమాల్లోనూ నటించారు.

అనేక ప్రశంసలు..

తెలుగు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా భూషణం పురస్కారాన్ని తాతయ్య పొందారు. భారతీయ సంస్కృతి, సమాఖ్య ఆధ్వర్యంలో నటసాహితీ కిరీటి, జనజాగృతి సంస్థ నుంచి నటహేల వంటి పురస్కారాలు అందుకున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్నారు.

తెలుగుభాష పరిరక్షణే ధ్యేయం..

తెలుగుభాష పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళుతున్నా. భాషపై విద్యార్థులకు పట్టు పెంచాలన్నదే నా ఆలోచన. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడంతో పాటు అంతరించి పోతున్న జానపద కళలను పరిరక్షించడం, కళారంగంపై అవగాహన కల్పించాలన్నది ఆశయం.

-మూల తాతయ్య

పెద్దపులి దాడిలో దూడ మృత్యువాత

- మూడు రోజుల తరువాత వెలుగులోకి..
- ఒడిశా వైపు వెళ్లినట్టు అనుమానాలు



పులి అడుగు జాడలను పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది





దూడ అవశేషాలు, పులి పాదముద్రలు

పాతపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం పరిసరాల్లోల పెద్దపులి అలజడి సృష్టిస్తోంది. తీమర గ్రామ శివారున గల తోటలో పులి దాడిలో ఆవుదూడ మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. అధికారులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తీమర గ్రామానికి చెందిన భైరి లక్ష్మణరావు అనే రైతు ఆవుదూడను పొలాలకు చేరువలో గల తన శాలలో శనివారం రాత్రి కట్టి ఉంచాడు. ఆదివారం ఉదయం నుంచి దూడ కనిపించలేదు. కుటుంబ సభ్యులతో కలసి సమీప పొలాలలో వెతికినా ప్రయోజనం కనిపించలేదు. గ్రామ సమీపంలో గల తోట నుంచి దుర్వాసన వస్తుండడంతో పొలాలకు వెళ్లే రైతులు మంగళవారం పరిసరాల్లో గాలించారు. అక్కడ ఆవు దూడ అవశేషాలు, పులి పాదముద్రలు కనిపించాయి. దీంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న అటవి, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి డా.మంచు కరుణాకర రావు ఆ దూడ కళేబరానికి పోస్టుమార్టం చేసి... జంతువు దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్కడి పాదముద్రలను ఫారెస్ట్ రేంజర్ పి.అమ్మన్నాయుడు పరిశీలించి పెద్దపులివేనని ధ్రువీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటన శనివారం అర్ధరాత్రి జరిగి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. ఈ సంఘటన తరువాత ఆదివారం అంతా అక్కడే ఉండి... పర్లాకిమిడి సమీప ప్రాంతం నుంచి ఒడిశా అడవులకు పులి చేరి ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి డా.బి.శ్రీవాణి, ఆర్ఐ బాబీ పండిట్, వీఆర్వో తాడి వెంకటరావు, ఫారెస్ట్ ఎస్ఓ పెద్దిన, బీవో ప్రవీణ్‌రాజ్, గ్రామస్తులు ఇప్పిలి మోహనరావు, బండి వెంకటరావు తదితరులు పరిశీలించారు.

పెద్దపులి సంచారం ఇలా...

పెద్దపులి మాళవ నుంచి జిల్లేడుపేట పంట పొలాల మీదుగా మహేంద్ర తనయ నదీ తీర ప్రాంతం నుంచి తీమర చేరుకున్నట్టు అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. శనివారం రాత్రి తీమరలో ఆవు దూడపై దాడి చేసి ఆహారంగా తీసుకుంది. ఆదివారం అక్కడే ఉండిపోయి... సోమవారం పర్లాకిమిడి మీదుగా సమీపంలోని ఒడిశా అడవులలోకి వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు.

ఒంటరిగా తిరగొద్దు

పాతపట్నం, కొరసవాడ పరిసర గ్రామాల్లో రాత్రి వేళల్లో, వేకువజామున ఒంటరిగా ఎవరూ సంచరించవద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-పి.అమ్మన్నాయుడు, ఫారెస్ట్ రేంజర్

అడవి జంతువులతో భయం భయం

- భీతిల్లుతున్న జనం

పలాస రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓవైపు పాతపట్నం పరిసరాల్లో పులి సంచారంతో జనం భయంభయంగా గడుపుతున్నారు. మరోవైపు ఉద్దాన ప్రాంతంలో అడవి జంతువు దాడులతో జనం భీతిల్లుతున్నారు. లేగదూడలు, గొర్రెలు, కుక్కలపై దాడులు జరుగుతుండడంతో ఉద్దానం ప్రజలు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. పలాస, వజ్రపుకొత్తూరు పరిధిలో అడవి జంతువులు రాత్రి వేళల్లో పశువుల శాలల్లోని లేగదూడలు, గొర్రెలపై పడి తినడంతో జనం భీతిల్లుతున్నారు. పలాస మండలంలోని మాకన్నపల్లి, చిననీలావతి సమీపంలోని పాతిన త్రినాథ్ అనే రైతు తోటలో సోమవారం రాత్రి లేగ దూడను అడవి జంతువు పొట్టన పెట్టుకుంది. దీనిపై సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు మంగళవారం ఆ ప్రాంతానికి చేరుకొని పాదముద్రలను పరిశీలించారు. అది పులి కాదని, హైనా... నక్క వంటివి కావచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి... అడవి జంతువుల దాడి నుంచి తమను కాపాడాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



జంతువు దాడిలో మృతిచెందిన గొర్రె పిల్ల

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

అరసవల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఓఎంసీఏపీ, సీయూఆర్‌ఏ పర్సనల్ ద్వారా జర్మన్ భాషపై శిక్షణతోపాటు ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతతో 35 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్‌లో రెండు, జీఎన్‌ఎంలో మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. గుంటూరులో ఆరు నెలల పాటు జర్మన్‌భాషలో ఎ1, ఎ2, బి1, బి2 స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. ఆసక్తిగల వారు ఒరిజినల్ (ఓడి, ఆర్‌ఎన్) సర్టిఫికేట్లు ఆ సంస్థ వారికి అందజేయాలన్నారు. పూర్తి హాజరుతో శిక్షణ విజయవంతంగా ముగించుకుని సదరు అభ్యర్థులు జర్మనీ వీసా పొందిన తర్వాత డిపాజిట్ తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. శిక్షణలో భోజనం, వసతి సౌకర్యం భరించాల్సి ఉంటుందన్నారు. బీ2 పరీక్ష ఫీజు మొదటిసారిగా హాజరయ్యే సమయంలో అభ్యర్థులు చెల్లించాలని వీసా అనంతరం సీయూఆర్‌ఏ సంస్థ అభ్యర్థులకు తిరిగి చెల్లిస్తారన్నారు. ఇతర వివరాలకు 9988853335 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

లొద్దపుట్టిలో వైద్య శిబిరం

ఇచ్ఛాపురం, డిసెంబరు03(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి గ్రామంలో విశాఖ కేన్సర్ ఆసుపత్రి సహకారంతో వైద్యులు మంగళవారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వైద్య పరీక్షలు జరుపుకున్నారు. ఈ క్యాంప్ ద్వారా మహిళలకు గర్భాశయ, రొమ్ము కేన్సర్ పరీక్షలు మగవారికి నోటి కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఆశి దాలయ్యరెడ్డి, ఆనంద్, నాగరాజు, తేజ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేప పిల్లలు పంపిణీ

సరుబుజ్జిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల చెరువుల్లో చేపల పెంపకం ద్వారా ఉపాధి కల్పించడానికి చర్యలు చేపడుతున్నట్టు నోడల్ అధికారి కృష్ణవేణి అన్నారు. మంగళవారం వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఉన్న ఆరు చెరువుల్లో చేపల పెంపకం చేపట్టడానికి చేపపిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బగాది సురేష్, గ్రామ మధ్య సహాయకురాలు శ్రీరత్న, టీడీపీ నాయకులు గిరి, టి.రాంబాబు, జి.రామారావు పాల్గొన్నారు.

విద్యార్థి పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గురుగుబెల్లి వైష్ణవి హర్యానాలో జరిగే అండర్-19 జాతీయ స్థాయి కబడ్డీ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్టు డీఈవో ఎస్.తిరుమలచైతన్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఈ నెల 11న హర్యానాలోని బిహానిలో జరిగే టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుతో వైష్ణవి పాల్గొననుంది. హెచ్‌ఎం బీవీ సాయిరాం, పీడీ ఎంవీ రమణ, పీఈటీ జి.మల్లేష్ అభినందనలు తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థులకు పరీక్షలు

సోంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధిగ్రస్థులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి జె.శ్రీనివాసరావు డయాలసిస్ పేషెంట్లతో మాట్లాడి వైద్యం అందిస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సివిల్ న్యాయాధికారి ఎ.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాదీ పుస్తకావిష్కరణకు ఆహ్వానం



శంకరరావు

పొందూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పొందూరు సన్నఖాదికి సంబంధించి చోటుచేసుకున్న పలు అంశాలు కలిగిన ఖాదీ పుస్తకావిష్కరణ మహోత్సవానికి స్థానిక ఏఎఫ్‌కేకే సంఘానికి చెందిన జల్లేపల్లి శంకరరావుకు ఆహ్వానం అందింది. ఈ నెల 7న ఉత్తర ప్రదేశ్‌లోని బనారస్ యూనివర్సిటీలోని భారత కళాభవన్‌లో ఆర్టిస్టిక్ ఇంటర్నేషనల్ ఖాదీపుస్తకాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.యోగి ఆదిత్యానాథ్ విష్కరించనున్నారు. శంకరరావు తెలుగు అనువాదకుడిగా మంచి పేరుంది. ఖాదీ విశిష్టతను ఉత్తర భారతదేశంలో హిందీలో అనువదించడంలో అనుభవం ఉంది.

పొగాకు ఆధారిత వస్తువులకు దూరంగా ఉండాలి

అరసవల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పొగాకు ఆధారిత వస్తువులైన సిగరెట్లు, పాన్‌మసాల, గుట్కాలు వినియోగానికి దూరంగా ఉండాలని రాష్ట్ర లీగల్ సలహాదారులు శివపుట్టి అన్నారు. మంగళవారం పాతబస్టాండ్‌లో జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా లా ఎన్‌ఫోర్సుమెంట్ డ్రైవ్‌ను జిల్లా వైద్యఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పోలీసుశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఎన్‌సీడీ పీవో వెంకట్రావు, ఎంవో వసుధ, ఎంఈవో కృష్ణారావు, ఏఎస్‌ఐ రవి ఉన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమా రుద్ర కోటేశ్వరాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య మాలాదారులు పాల్గొని పూజలు చేశారు. 8వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

‘కిశోరి వికాసం’తో బాలిక భవిష్యత్తుకు పునాది

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవిల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం కార్యక్రమం ద్వారా బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం గుజరాతీపేటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కిశోరి వికాసం పునః ప్రారంభం రాష్ట్రంలో ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద, సంస్థలు, ఎన్జీవోల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందని, 11-18 ఏళ్ల బాలికలకు విద్య ఆరోగ్య భద్రత ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతి, పీవో శోభారాణి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగుపర్చుకోవాలి

లావేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని రణస్థలం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో సీహెచ్ రూప్సీబాయి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోరి వికాసం పునఃప్రారంభ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎడ్యుకేషన్, హెల్త్, న్యూట్రీషన్, హ్యూమన్ ట్రాఫింగ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విశ్వేశ్వరరావు, ఎంఈవోలు ఎం.వాగ్దేవి, మురళీకృష్ణ, ఎస్ఐ జి.లక్ష్మణరావు, ఐసీడీఎస్ ఈవో బి.ఉష తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో ఈ ప్రాంతానికి అనుకూలంగా ఉండేపంటలనే వేసుకోవాలని వ్యవసాయ సహాయకులు కె.జగన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండపల్లి, పురుషోత్తపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారిణి టి.భార్గవి అధ్యక్షతన పొలంబడి పిలుస్తోంది నిర్వహించారు. జీడి, మామిడి ఇన్సూరెన్స్ నమోదు చేసుకొనే ఉపయోగం వాటి వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలు విధి విధానాలపై అవగహణ కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

● ఎస్పీ మహేశ్వరరెడ్డి



ట్రాఫిక్ సిబ్బందికి రేడియం జాకెట్స్ అందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణతో సంబంధిత విభాగాల సమన్వయంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వివిధ ప్రైవేట్ యాజమాన్యం సౌజన్యంతో అందజేసిన స్టాపర్స్, రేడియం జాకెట్లు, మాస్క్‌లు, ఎల్‌ఈడీ బ్యాటన్స్‌లను మంగళవారం పోలీసులకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సమస్యలు నియంత్రణకై చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఇరుకు రోడ్ల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఆయా యాజమానాలు ముందుకు వచ్చి వీటిని అందజేశారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, కె.పైడపునాయుడు, వి.నాగరాజు, ఆయా యాజమాన్య ప్రతినిధులు ఉన్నారు.

సీహెచ్‌సీలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి పరీక్షకుమార్

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కిడ్నీ రోగులు పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సకాలంలో మందులు అందించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్ట్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీక్షకుమార్ అన్నారు. మంగళవారం సీహెచ్‌సీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ భవనాన్ని సందర్శించారు. మరో నెల రోజుల్లో డయాలసిస్ యూనిట్ అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి, వైద్యులు సత్యజ్యోత్స్న, రమ్య, వై.కల్యాణి, న్యాయవాదులు ఎస్.రమణయ్యరెడ్డి, జి.సీతయ్యరెడ్డి, డి.కృష్ణమూర్తిరెడ్డి, మనోజ్, రంగారావు, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

జి.సిగడాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ పీవో జోల పాపినాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళాభివృద్ధి - శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర వికాసం మండల స్థాయి శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, రుతుక్రమం, పోక్స్ చట్టం, సెల్ఫ్ డిఫెన్స్, యోగా, లైవ్‌లీహుడ్, సాధికారితపై వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైద్యాధికారి పి.సుమబిందు, సూపర్‌వైజర్ టి.లక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం



శ్రీరామ్మూర్తిని పరామర్శిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు

జి.సిగడాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట రావు తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకులు బూపతి శ్రీరామ్మూర్తిని చెట్టుపొదిలాంలో ఆయన పరామర్శించారు. అనాగరోగ్యానికి గల కారణాలను అడిగితెలు సుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. టీడీపీ కూటమి నా యకులు కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, టంకాల మౌళీశ్వరరావు, జెక్కంపూడి దాసు, నక్క మురళి, కోన వెంకటరావు, బోగాది అప్పల నాయుడు ఉన్నారు.

విజయవంతం చేయాలి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న కొరికాన రవికుమార్ కార్యక్రమానికి కూటమి నాయ కులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ కోరారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న సు డా చైర్మన్‌గా రవికుమార్ బా ధ్యతలు తీసుకుంటారని తెలిపారు. మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాసరావు, కూటమి ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికా రులు హాజరుకానున్నట్టు తెలిపారు.

కార్పొరేషన్ ద్వారా కళింగ సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు

ఎచ్చెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సీనియర్ న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళింగ కులస్థుల సంక్షేమానికి తన వంతు కృషిచేస్తానన్నారు. ముఖ్యఅతిథులుగా ఆమదాలవలస, నరసన్నపేట శాసనసభ్యులు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొన్నారని భువనేశ్వరరావు తెలిపారు.

● ఆమదాలవలస, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కళింగ కార్పొరేషన్ సంక్షేమ సంఘ బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మంగళవారం విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో కళింగ కార్పొరేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ అధ్యక్షులు రోణంకి కృష్ణమూర్తి, డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖరరావుతో పాటు మిగిలిన డైరెక్టర్లు అందరకు అభినందనలు తెలిపారు.

● కవిటి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి లోళ్ల రాజేష్, బార్ల చిన్నబాబు మంగళవారం బాధ్యతలు చేశారు. అధ్యక్షుడితో పాటు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారన్నారు.

● హరిపురం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): కాళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బావన దుర్యోధన మంగళవారం అమరావతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్ కుమార్, ముంజేటి చంద్రశేఖర్, తమ్మినేని ధనుంజయ, దేబాసిస్ పండా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ.. దైవకార్యంగా భావించాలి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేసే సేవను దైవ కార్యక్రమం వలే భావించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో మంగళవారం ప్రత్యేక విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. జీవితంలో శారీరక, మానసిక అవంతరాలను ఎదుర్కొంటున్న దివ్యాంగులకు చేదోడువాదోడుగా ఉండాలన్నారు. జిల్లా సమగ్ర విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో దివ్యాంగుల పేర్లను నమోదు చేసి, ఈ ఏడాది సెప్టెంబరు నాటికి సుమారు 5,900 మందికి పలు రకాల సేవలందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, ప్రత్యేక విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎస్‌వీ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అధ్యయన కేంద్రం

వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన దివ్యాంగుల అధ్యయన కేంద్రాన్ని వీసీ ప్రారంభించారు. భారతీయ పునరావాస కేంద్రం (ఆర్‌సీఐ) మార్గదర్శకంలో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఈ కేంద్రాన్ని వర్సిటీలో ప్రారంభించామని వీసీ చెప్పారు. అనంతరం వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ ఆధ్వర్యంలో వలంటీర్లు దివ్యాంగులకు అందరూ అండగా ఉండాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

వ్యాధుల నిర్ధారణపై శిక్షణ



ఆమదాలవలస, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో చేపలు, రొయ్యిల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణపై మత్స్యశాఖ విస్తరణ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జాతీయ మధ్య అభివృద్ధి మండలి సహకారంతో ఈ శిక్షణా తరగతులను నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, మ త్స్యశాస్త్రవేత్త బాలకృష్ణ, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు అనుమతివ్వండి

కంచిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్తలి వద్ద ఉన్న జేఎస్‌కే రైస్‌మిల్లుకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతివ్వాలని ఎంఎస్ పల్లి, కర్తలి, సిర్తలి, రుగుపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్‌కు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఆమదాలవలస, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం పురపాలక సంఘంలోని 13వ వార్డు పరిధిలోని కొత్తకోటవారి వీధిలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ వద్ద మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బొగ్గు లారీ బోల్తా: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



బైపాస్ రోడ్డులో బోల్తాపడిన బొగ్గు లారీ

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొట్టిపల్లి ఫ్లైఓవర్ వంతెన వద్ద హైవేపై మంగళవారం ఒడిశా నుంచి అనకాపల్లి వెళుతున్న బొగ్గు లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. ఈ ప్రమాదంతో విజయవాడకు చెందిన డ్రైవర్ పూర్ణ తలపై బలమైన గాయాలు అయ్యాయి. లారీ అదుపు తప్పి బోల్తా పడే సమయంలో సర్వీసు రోడ్డులో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ దాలినాయుడు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

హిరమండలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాత హిరమండలం వద్ద మంగళవారం ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయింది. గుణుపూర్ నుంచి శ్రీకాకుళం వెళ తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ప్రయాణికులు సురక్షితంగా బటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి



మృతిచెందిన ఆవులు

ఎచ్చెర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామానికి చెందిన పొట్నూరు అచ్యుతరావు, పిల్లాటి అప్పన్నమ్మలకు చెందిన మూడు ఆవులు మంగళవారం విద్యుదాఘాతానికి మృతిచెందాయి. ఈ సంఘటనలో అచ్యుతరావుకు చెందిన రెండు, అప్పన్నమ్మకు చెందిన ఒక ఆవు మృతిచెందాయి. ఊరు శివారు పొలాల్లో మేత కోసం వెళ్లిన ఈ ఆవులు తెగిన విద్యుత్ తీగలు తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.3 లక్షలు విలువ చేసే ఆవులు కళ్లముందే కోల్పో వడంతో ఆ రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు పశు సంవర్థక శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తెగిన విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరుతున్నారు.

సంఘ అభివృద్ధికి పాటుపడతా: కుత్తుమ



కుత్తుమ లక్ష్మణ్‌కుమార్‌కు సత్కరిస్తున్న కూటమి నాయకులు

పలాసరూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్ని కులక్షత్రియ సంఘ అభివృద్ధికి పాటుపడతానని డైరెక్టర్‌గా నియమితులైన కుత్తుమ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బొడ్డపాడులో మంగళవారం బొడ్డపాడు, చినగురుదాసుపురం గ్రామాలకు చెందిన కూటమి కార్యకర్తలు, నేతలు ఆయనను సత్కరిం చారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ ప్రాంతంతో పాటు అగ్నికుల క్షత్రియ సంఘాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కిక్కర ఢిల్లీరావు, మురిపింటి కుమారరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యవసాయ ప్రదర్శన ప్రారంభం

ఒడిశా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్లా కిమిడి గజపతి స్టేడియంలో జిల్లా స్థాయి వ్యవ సాయ యంత్రాల ప్రదర్శన మేళాను మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ్‌కుమార్ దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎ. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు, మహిళా స్వయం ఉపాధి సంఘాలకు వ్యవసాయ పరికరాలను గిట్టుబాటు ధరకు అందించేందుకు ఈ మేళా ఉపయోగ పడు తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో గుణనిధినాయక్, మున్సిపల్ చైర్మన్ నిర్మలాశెట్టి, అదనపు జిల్లా కలెక్టర్ రాజేంద్రమిరాజ్, సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ డీన్ ఎస్పీనందా పాల్గొన్నారు.

శాసనసభలో ఎమ్మెల్యే రూపేష్ గళం



పర్లాకిమిడి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి అసెంబ్లీలో మంగళవారం తన గళం వినిపించారు. జిల్లాలో ఆరోగ్య సేవలపై ప్రశ్నలు వేశారు. డాక్టర్ల కొరత లేకుండా చూడాలని, ఐసీయూ విభాగం ఏర్పాటు చేయాలని, నిపుణులైన వైద్యుల నియామకం చేపట్టాలని కోరారు.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

పర్లాకిమిడి,డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): వైకల్యం అనేది శరీరానికేనని, కాని మనసుకు కాదని కలెక్టర్ విజయ్‌కుమార్‌దాస్ అన్నారు. మంగళవారం బిజూ కల్యాణ మండపంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినో త్సవం నిర్వహించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి గుణనిధినాయక్, వైద్యులు మహ్మద్ ఆలీ, సీసీడీ సంస్థ అధినేత రాజు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న కలెక్టర్ విజయ్‌కుమార్ దాస్

చినుకులకు రోడ్లు ఛిద్రం

టెక్కలి/పోలాకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గడచిన మూడు రోజులుగా కురిసిన చిన్నపాటి వర్షాలకు పలు రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ఇప్పటికే గోతుల మయంగా ఉన్న రోడ్లపై వర్షపు నీరు చేరి మరింతదారుణంగా ఉన్నాయి. ప్రధానంగా టెక్కలి పట్టణంతో పాటు పోలాకి మండలం ప్రియాగ్రహారం, పిన్నింటిపేట, మొగివిల్లిపేట, సత్రవుపేట, కోడూరు తదితర గ్రామాల రహదారులపై ఉన్న గోతుల్లో నీరు చేరింది. టెక్కలి పట్టణం అంబేడ్కర్ జంక్షన్‌లో ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులు పూడ్చినా చిరుజల్లులకు ఆ గోతులు ఛిద్రంగా తయారయ్యాయి.



టెక్కలి అంబేడ్కర్ కూడలిలో ఊడిన ప్యాచ్ వర్క్ పనులు



పోలాకి: ప్రియాగ్రహారం రోడ్డు గోతుల్లో ఇలా..

ఆసుపత్రికి వెళితే అంతే..

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక వందపడకల ఆసుపత్రి మెయిన్ గేట్ ఎదుట బురదమయంగా తయారైంది. దీంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా బురదలో పడి పోవాల్సిందే.. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



ఆసుపత్రి ఎదుట బురదమయంగా..

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం కలిగించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం కలిగించాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళ వారం భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలు, కోర్టులో న్యాయసేవా సంఘం ద్వారా అందిస్తున్న న్యాయసేవలను దివ్యాంగుల తల్లిదండ్రులకు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగ చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్వీ ప్రతాప్, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం డి.గోవిందరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శరత్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ పిల్లలకు బహుమతులందిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

సేవలను సద్వినియోగం చేసుకోండి

పలాస, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పలాస కిడ్నీ ఆసుపత్రిలో రోగులకు మంచి సేవలు అందుతున్నాయని, దీనిని వ్యాధిగ్రస్థులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ న్యాయా ధికారి యు.మాధురి కోరారు. ఈ మేరకు మంగళవారం లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ హోదాలో ఆమె కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. అంతకు ముందు న్యాయాధికారిని ఆసు పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ సత్కరించారు. డీన్ డాక్టర్ కె.మోహన్‌బాబు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాకేష్, బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జీఎంఎస్ అనిల్ రాజు పాల్గొన్నారు.



న్యాయాధికారి మాధురిని సత్కరిస్తున్న పద్మజ

పుస్తెలతాడు చోరీ

రణస్థలం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఆర్ పురం పంచాయతీ సీతంవలస గ్రామా నికి చెందిన జి.పాపమ్మకు సంబంధించిన రెండు తులాల బంగారపు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీ సులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సీతం వలస ఆటోపై వెళ్తున్న పాపమ్మ మెడలో బంగారు పుస్తెలతాడును సినిమా థియేటర్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పాపమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేదెలు పట్టివేత

రణస్థలం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అక్రమంగా గేదెలను తరలిస్తున్న రెండు వాహనాలను మంగళవారం పైడిభీమవరం సమీపాన జేఆర్ పురం పోలీసులు పట్టుకున్నారు. ఈ వాహనాల్లో ఉన్న తొమ్మిది గేదెలను తగరపువలస తర లించి, జి.రాజు, రాజాపై కేసు నమోదు చేసి నట్టు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సారాను అరికట్టేందుకు దృష్టి సారిస్తున్నట్టు, ఇందు లో భాగంగా మంగళవారం దాడులు నిర్వహిం చినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బేబి అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఆర్‌సీ పురం వద్ద సిరుగుడు నరసమ్మ వద్ద ఉన్న 150 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేసినట్టు సీఐ బేబి తెలిపారు.

సచివాలయ ఉద్యోగికి గాయాలు

ఆమదాలవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధి లక్ష్ముడుపేట కూడలి వద్ద లారీ ఢీకొట్టిన ఘటనలో సచివాలయ ఉద్యోగికి గాయాల య్యాయి. వివరాల్లోకి వెళితే.. బూర్జ మండలం ఓవీపేట గ్రామంలో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు గ్రామానికి చెందిన పొన్నాడ త్రినాథరావు మంగళవారం విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా.. ఆమదాలవలస వైపు నుంచి పాలకొండ వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో త్రినా థరావుకు చేతులు కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సచివాలయ సిబ్బందిపై దాడి

పొందూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తోలాపి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం సచివాలయ సిబ్బందిపై స్థానిక ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు దాడి చేయడంతో పాటు కార్యాలయంలో ఉన్న కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. మధ్యా హ్న సమయంలో కార్యాలయానికి వచ్చిన ఆ వ్యక్తి సచివాలయంలో కొంత సేపు కూర్చున్నాడు. ఆ సమ యంలో వీఆర్‌వో ఎం.దివాకర్ (రేవతీరావు)తో పాటు డిజిటల్ అసిస్టెంట్ కార్యాలయంలో ఉన్నారు. మిగి లిన సిబ్బంది విధి నిర్వహణపై బయటకు వెళ్లారు. అయితే ఒక్కసారిగా కార్యాలయంలో ఉన్న కంప్యూటర్‌ను ఆ వ్యక్తి నేలకు కొట్టి ధ్వంసం చేశాడు. అనంతరం వీఆర్‌వో రేవతీ రావుపై దాడి చేయడంతో పాటు మెడపట్టి తోసేయడంతో తూలిపడ్డాడు. అక్కడే ఉన్న పంచాయతీ ఉప సర్పంచ్ పప్పల శ్రీనివాసరావు కల్పించుకుని ఆ వ్యక్తి నుంచి వీఆర్‌వోను విడదీ శాడు. సిబ్బందిపై దౌర్జన్యం చేయడం సరికాదని ఆ వ్యక్తిని బయటకు పంపించాడు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి కూన వినోద్ ద్వారా ఎంపీడీవో మన్మధరావు, ఈవోఆర్‌డీ సింహాచలానికి, తహసీల్దార్ వెంకటేశ్ రామానుజన్‌కి తెలిపారు. విషయాన్ని మండల అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఆక్రమణలు తొలగింపునకు చర్యలు



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

హిరమండలం, డిసెంబరు3 (ఆంధ్యజ్యోతి): హిరమండలం బస్టాండ్ ప్రాంతంలో ఏబీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ హనుమంతురావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను గుర్తించారు. మండల సర్వేయర్ రమణయ్య వీఆర్వోలు సింహాచలం, భాస్కరరావు కొలతలు చేపట్టారు. ఆక్రమణల వల్ల వర్షపు నీరు వెళ్లేందుకు ఇబ్బందులు తలెతు_తున్నాయన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పోలాకి, డిసెంబరు 3 (అంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఎంపీడీవో జి.రవికుమార్ హెచ్చరించారు. గొల్లలవలస శివాలయం ఎదురుగా ఉన్న ఆక్రమణదారులను పిలిపించి స్వచ్ఛందగా తొలగింపజేశారు. ప్రభుత్వ భూమిలో బోర్డులు పెట్టాలని కార్యదర్శి యశోద, వీఆర్వో మెండ లక్ష్మిలను ఆదేశించారు.

గింజలను దక్కించేందుకు పాట్లు



ఆరిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తిన దృశ్యం

నరసన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో పొలాల్లో తడిచిన వరి ఒదె లను అరబెడుతున్నారు. మరో వైపు ఓదెల కింద ఉన్న వర్షపు నీరు బయటకు తీస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చి ఆరబెట్టి ఆ తరువాత విక్రయించేందుకు బస్తాల్లో ఎత్తుతున్నారు. 24 శాతం కంటే ఎక్కువ తేమ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో రోడ్లన్నీ కల్లాలను తలపిస్తున్నాయి.

రెక్కరాల్చు పురుగుతో అవస్థలు

నందిగాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో రెక్కరాల్చు పురుగు కారణంగా చేతి కందిన పంట నేలరాలడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వల్లభరాయుడుపాడు, దేవాడ, మణిగాం, జల్లపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా పురుగు ఆవరించి రెక్కరాలుస్తుండడంతో పొలాల్లో రైతులు వెన్నులు ఏరడానికి ప్రయాస పడుతున్నారు. 20 శాతం మేర పంట నేలపాలవుతోందని రైతులు జి.మన్మథరావు, ఎస్.కూర్మినాయకులు, ఎ.సుదర్శన రావు, శశిభూషణరావు, గురునాథ, బి.రాము తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కపురుగు కారణంగా జరిగిన నష్టంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎస్.కృష్ణారావు, జి.ప్రవీణ్‌కుమార్ తదితరులు తెలిపారు.



నేలపాలైన వరి వెన్నులని ఏరుతున్న రైతులు

గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

హిరమండలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సుభలయ ఆర్‌ఆర్ కాలనీలో కె.కరువమ్మ భర్త పేరిట ఉన్న స్థలాన్ని ఆక్రమంచి అమ్మేందుకు కొందరు కుట్ర పన్ను తున్నారని ఆరోపిస్తూ సీపీఐ జిల్లా నాయ కులు బలగ శ్రీరామమూర్తి, దేవుదల వెంకటరమణ, అనపాన షణ్ముఖరావు తదితరులు గిరిజనులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు.



మెరుగైన విద్య అందించడమే లక్ష్యం: ఎంజీఆర్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి మెరుగైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం ఏకలవ్య పాఠశాలకి రూ.1.40 కోట్లతో ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వం ఏకలవ్య పాఠశాల మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాల కు వెళ్లేలా విద్యాభ్యాసం చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తి, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, టీడీపీ నాయకులు సలాన మోహనరావు, సర్పంచ్ రేఖాన లక్ష్మమ్మ, ఎం.బానోజీరావు, ఈఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

● 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఉకిలిపడ్డ ఎక్సైజ్ అధికారులు

టెక్కలి, డిసెంబరు 3(అంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ షేక్‌మీరా షాహిద్ హెచ్చరించారు. మంగళవారం 'ఆంధ్ర జ్యోతి'లో 'ఊరూ-వాడా బెల్టు' శీర్షికతో వచ్చిన కథనానికి ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఉలికిపడ్డారు. ఈ కథనానికి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎక్సైజ్ సూప రింటెండెంట్ తిరుపతి నాయుడు స్పందించి ఇచ్చిన ఆదేశాల మేరకు బూరగాం, కొండభీంపురం, శాసనాం, టెక్కలి ఆదీ ఆంధ్రావీధి తదితర ప్రాంతాల్లో స్థానిక ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పలాస ఏఈఎస్ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు సీఐ షేక్‌మీరా సాహిద్, ఎస్‌ఐలు సత్యనారాయణ, రాజేశ్వరరావు, ఎం.వేణు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి సర్వమంగళ వీధికి చెందిన ఒక వ్యక్తి వద్ద నుంచి 20 సారా ప్యాకెట్లు, ఆదీఆంధ్రా వీధిలో ఆరు మద్యం నిబ్బులతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బూరగాం గ్రామంలో ఒక వ్యక్తి నుంచి 11 మద్యం సీసాలు, రెండు బీరుసీసాలతో పట్టుబడ్డాడని, అక్కవరంలో కూడా ఆరు మద్యం సీసాలతో పట్టుబడ్డాడని, వారందర్నీ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అయ్యప్పనగర్, కంద్రవీధి తదితర ప్రాంతాల్లో దాడులు కొనసాగించినట్లు పేర్కొన్నారు. బెల్టు షాపుల నిర్వహణకు గ్రామాలు, వార్డుల్లో ఎవరైనా వేలంపాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఆయా ప్రాంతాల్లో నిఘా కొనసాగుతుందన్నారు. అనంతరం గ్రామస్థులకు అవగాహన కల్పిం చారు. ఈ విషయమై ఊరూ-వాడా బెల్టు కథనంపై ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా స్థానిక ఎక్సైజ్ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏఈఎస్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారన్నారు. బెల్టు అమ్మకాల్లో దొరికితే కేసులతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. బైండోవర్ కూడా చేయిస్తామన్నారు. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కలిగిస్తున్నామని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ల్యాబ్ టెక్నీషియన్ మురళి సస్పెన్షన్

కోటబొమ్మాళి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఏసీబీకి చిక్కిన ల్యాబ్ టెక్నీషియన్ గొండు మురళిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీసీహెచ్‌ఎస్ డా.కళ్యాణ్ బాబు మంగళవారం ప్రకటించారు. బుడితి సీహెచ్‌సీలో పనిచేస్తున్న మురళి ఇంటిపై ఇటీవల ఏసీబీ అధికారులు దాడిచేసి సుమారు రూ.50 కోట్లు అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆయనకు ఈనెల 12 వరకు రిమాండ్ విధించింది. ఈయన గతంలో మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రభుత్వ పీఏగా పనిచేశారు.

కాలంచెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన ఎరువులు, మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని టెక్కలి ఏడీఏ తిరుమలరావు అన్నారు. మంగళవారం పట్టణంలో ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుంటే షాపులను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో సునీత తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలైన డ్రగ్స్, గంజాయి వంటి వాటికి యువకులు, విద్యార్థులు దూరంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. అంబుగాం హైస్కూ ల్‌లో మంగళవారం 'సంకల్పం'లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సిగ రెట్టు, మద్యంతో పాటు ఆన్‌లైన్ గేమ్స్ కూడా యువత, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. వీటికి దూరం గా ఉండి చెడు అలవాట్లను దరి చెరనీయవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ రావు, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు తనిఖీలు

జలుమూరు, డిసెంబరు 3: (ఆంధ్రజ్యోతి) గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. శ్రీముఖలింగం, చల్లవానిపేట, లింగాలవలస, తిలారు రైల్వే స్టేషన్లలో మంగళవారం తనిఖీ చేశారు. ఒడిశా నుంచి దిగుమతి జరుగుతున్న గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. చల్లవానిపేట కూడలిలోని పాన్‌షాపులు, జనరల్‌స్టోర్సుల్లోనూ జాగిలాలతో తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం దారుణం

కొత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రూ.15,484 కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజల పై వేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పేర్కొన్నారు. కొత్తూరు లో మంగళవారం విలేకరులతో మాట్లాడేతూ.. 2023-24 సర్దుబాటు చార్జీ రూ.9412 కోట్లు భారం పడు తుంద న్నారు. తాజాగా వచ్చే నెల నాలుగో విడత సర్దుబాటు చార్జీలు కలిపేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోం దన్నారు. తక్షణం వీటి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించాలని, లేకుంటే పోరాటం చేస్తామన్నారు. కార్యక్ర మంలో నేతలు గంగరావు సింహాచలం, శిర్ల ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మెళియాపుట్టి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మెళియాపుట్టి, చాపర పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. అధికంగా గిరిజన గ్రామాలు న్నందువల్ల 24 గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో గిరిజన రోగులు ఉండేందుకు సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం పెద్దలక్ష్మీపురం బాలురు వసతిగృహన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి

మెళియాపుట్టి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచి సిద్ధం కావాలని డీఈవో తిరమ చైతన్య అన్నారు. మంగళవారం చాపర, మెళియాపుట్టి, కొసమాళ జడ్పీ పాఠశాలలను సందర్శిం చారు. సిలబస్ పూర్తి చేసి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధన దిశలో ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు దేవేంద్రరావు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో చందు ప్రతిభ

పోలాకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఈదులవలస మోడల్ కళాశాల విద్యార్థిని కె.చందు కాంస పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, పీడీ ఎం.నీలం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నంద్యాలలో గత రెండురోజులుగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తెచ్చిందన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.